క్లుప్తంగా

మల్లన్నకు సోమవార సేవ



స్వామిఅమ్మవార్లకు వెండిరథోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సోమవార సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసిన డేవిడ్

బండి ఆత్మకూరు: మండలంలోని ఎ.కోడూరు గ్రామ పరిధిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు డేవిడ్ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు విశ్రాంతి సమయంలో వడదెబ్బ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేయాలని, జనవరి నుంచి మార్చి వరకు చేసిన పనులకు వేతనాలు చెల్లించాలని కోరారు.

మహానందిలో భక్తుల సందడి



పెద్దకోనేరులో భక్తుల కోలాహలం

మహానంది: మహానంది ఆలయం సోమవారం భక్తజనసందడిగా కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి కోనేరుల్లో పుణ్యస్నానాలుఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

సన్మానం



బ్యాంక్ మేనేజర్‌ను సన్మానించిన వెలుగు సిబ్బంది

పగిడ్యాల: బదిలీపై బెంగళూరుకు వెళ్తున్న కెనరా బ్యాంక్ పగిడ్యాల బ్రాంచ్ మేనేజర్ కావేరి, హుబ్లీకి బదిలీపై వెళ్తున్న ఫీల్డ్ ఆఫీసర్ రంగస్వామిలను వెలుగు సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం చంద్రకళ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మండల సమాఖ్య ఓబీలు, వెలుగు సీసీలు హాజరయ్యారు.

నివాళి



రామారావు చిత్ర పటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

నందికొట్కూరు: విప్లవ సంస్కృతిక ఉద్యమకారుడు రామారావు వర్ధంతి సదర్భంగా ఆయన చిత్ర పటానికి కమ్యూనిస్ట్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్ - న్యూ డెమోక్రసీ) జిల్లా కార్యదర్శి నరసింహులు, నాయకులు మజీద్‌మియా, ఎల్లనాయుడు, శివ, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద నీడ కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

పాములపాడు: ఉపాధి పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసి కూలీలకు నీడ కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. పని ప్రదేశంలో తాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు. 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చూడటానికి ఏడాదిపొడవునా పచ్చగా ఉండే కోనో కార్పస్ చెట్లు పర్యావరణానికే గాక మనుషుల ప్రాణానికి కూడా ముప్పు. కొన్ని రాష్ట్రాల్లో ఈ చెట్లను నిషేధించటంతోపాటు ఉన్న చెట్లను వేర్లతో సహా పెకిలించేశారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం కోనోకార్పస్ చెట్ల సంరక్షణను నిషేధించటంతోపాటు ఇప్పటికే ఏపుగా పెరిగిన చెట్లను వెంటనే తొలగించాలని అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వీటిని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రోడ్లకు ఇరువైపులా నాటి సంరక్షిస్తున్నారు. వీటివల్ల పర్యవరణానికి ప్రజల ప్రాణాలకు ముప్పు అని తెలిసినా పట్టించుకునే నాథుడేలేరు. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలకు హానికలిగించే కోనోకార్పస్ చెట్ల నిర్మూలను చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోనోకార్పస్ చెట్లు... ప్రాణాలకు ముప్పు!

- ఆక్సిజన్ తీసుకొని కార్బన్‌డయాక్సైడ్ విడుదల
- గాలిపీల్చితే అలర్జీ, ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధుల వ్యాప్తి



జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న కోనోకార్పస్ చెట్లు

జూపాడుబంగ్లా: కోనోకార్పస్ చెట్లు మనదేశానికి సంబంధించిన మొక్క కాదు. ఇతర దేశాల నుంచి దిగుమతి అయిన చెట్టు ఇది. ఉష్ణమండల ప్రాంతాలైన ఉత్తర, దక్షిణ అమెరికాతో పాటు కరేబియన్, ఆఫ్రికా, క్లోరిడా, మెక్సికో వంటి ప్రాంతాల్లో కోనోకార్పస్ చెట్లు అధికంగా ఉండేవి. ఈ చెట్ల వల్ల కలిగే ముప్పును తెలుసుకున్న ఆయా దేశాల్లో నిషేధించటంతో పాటు మనదేశానికి దిగుమతిచేశారు.

కార్బన్‌డయాక్సైడ్ వదులుతాయి..

అన్ని వృక్షాలు కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చుకుని ప్రజల మనుగడకు అవసరమైన ఆక్సిజన్‌ను వదులుతాయి. కానీ కోనోకార్పస్ చెట్లు మాత్రం ఆక్సిజన్‌ను పీల్చుకుని కార్బన్‌డయాక్సైడ్‌ను వదులుతాయి. ఈ చెట్ల వల్ల మనుషుల మనుగడకు అవసరమైన ఆక్సిజన్ శాతం తగ్గిపోయి ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. ఈ చెట్టు కింద నిల్చొని గాలి పీల్చితే విషం పీల్చినట్లే అవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. దీనికితోడు ఏడాదిలో రెండు పర్యాయాలు పుష్పించే కోనోకార్పస్‌చెట్ల పుప్పొడులు అత్యంత సూక్ష్మంగా ఉండటంతో సులభంగా గాల్లో కలిసిపోతాయి. చెట్ల సమీపంలో నిల్చొని గాలిని పీల్చడం వల్ల శ్వాసకోశవ్యాధులు వస్తాయి.

ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి

కోనోకార్పస్ చెట్ల వల్ల ప్రాణాంతకమైన వ్యాధులు వ్యాపిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ చెట్ల గాలిని పీల్చటం వల్ల శ్వాసకోస వ్యాధులు, జలుబు, దగ్గు, ఉబ్బసం, అలర్జీ, చర్మసంబంధిత వ్యాధులు వ్యాపిస్తాయి. ఈ చెట్ల ప్రభావం వృద్ధులు, చిన్నపిల్లల ఆరోగ్యంపై త్వరగా ప్రభావం చూపిస్తాయి.

ప్రాణాలకు హాని



కోనోకార్పస్ చెట్లు ఆక్సిజన్ పీల్చుకుని కార్బన్ డయాక్సైడ్‌ను వదులుతాయి. తద్వారా ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. ఈ రకం చెట్లను ప్రభుత్వ కార్యాలయాలు, ఆఫీసులు, ఇళ్ల పరిసరాల్లో పెంచుకోవటం వల్ల చేజేతులా ప్రాణాలకు ఇబ్బంది కలిగించుకున్నట్లు అవుతుంది. ఇళ్ల పరిసరాల్లో ఈ చెట్లు ఉంటే వెంటనే తొలగించుకోవడం మంచిది.

– డాక్టర్ యశశ్విని, పారుమంచాల పీహెచ్‌సీ

శ్వాసకోస వ్యాధులు వ్యాపిస్తాయి



కోనోకార్పస్ చెట్లు విడుదల చేసే కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చటం వల్ల శ్వాససంబంధిత వ్యాధులు వ్యాపిస్తాయి. చిన్నపిల్లలు, వృద్ధులపై ఈ చెట్ల ప్రభావం త్వరగా చూపుతుంది. దగ్గు, ఆయాసం, ఉబ్బసం వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆఫీసుల వద్ద, రోడ్ల వెంట ఉంటే ఈరకం చెట్లను తొలగించడం మేలు.

– డాక్టర్ గంగాధర్, జూపాడుబంగ్లా పీహెచ్‌సీ

సమస్యలు పరిష్కరించండి

జూపాడుబంగ్లా: సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. ఎంతో నమ్మకంతో ప్రజలు ఫిర్యాదులు ఇస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం అంబమ్మ, ఏఈలు నాగేంద్ర, జ్యోతి పాల్గొన్నారు.

- **పాములపాడు:** పంట పొలాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ రైతుల నుంచి 2 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. చెలిమిల్ల, ఇస్కాల గ్రామాలకు చెందిన రైతులు అర్జీలు ఇచ్చారన్నారు. వీటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.
- **కొత్తపల్లి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఉమారాణి అధ్యక్షతన పీజీఆర్ఎస్ కార్యక్రమం మండల స్థాయి అధికారులతో నిర్వహించారు. ఆయా గ్రామాల రైతుల నుంచి 7 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆరుగురు రైతులు వారి పొలాలను సర్వేచేయాలని, ఒక రైతు తన భూమిని ఆన్‌లైన్ చేయాలని వినతులు ఇచ్చారన్నారు.

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జడ్జి పి.రాహుల్‌అంబేద్కర్

ఆత్మకూరు: చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి పి.రాహుల్‌అంబేడ్కర్ అధికారులకు సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవంలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. అధికారులు చట్టాల గురించి ప్రజలకు తెలియజేసి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలో వివరించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు హక్కులు, పథకాల గురించి వివరించారు. ప్రతి భవన నిర్మాణ కార్మికుడు ఈ శ్రమ కార్డును పొందాలన్నారు. రాజీ కాదగిన కేసులకు ప్రతి మూడు నెలలకోసారి జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో త్వరగా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగభూషణంశెట్టి, ఏపీఓ ధనుంజయ, న్యాయవాదులు పాల్గొన్నారు.

20న సచివాలయాల ఎదుట ధర్నా



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు

నందికొట్కూరు: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కూలీల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 20న గ్రామ సచివాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం నాగటూరు, కొణిదేల, బిజినవేముల గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి జాబ్ కార్డుకు 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, ప్రతి వారం ఉపాధి బిల్లులు మంజూరు చేసి కూలీలను ఆదుకోవాలని కోరారు. సంఘం నాయకులు రఘునాథ్ నరసింహా, మల్లయ్య, రమేష్, నాగేశ్వర్, ఎర్రన్న, మహేశ్వరి, మాధవి, వెంకటేశ్వర్లు, సంజమ్మ, దేవదానం, రమణయ్య, ఏసన్న, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నందికొట్కూరు: కారల్ మార్క్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంసీపీఐ యూ నాయకులు లాజరస్ సూచించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కారల్ మార్క్స్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లాజరస్ మాట్లాడుతూ కారల్ మార్క్స్ శ్రామికుల కష్టాలు తీర్చేందుకు చివరి వరకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసులు, నాగలక్ష్మమ్మ, సంజమ్మ, రోజమ్మ, లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

- **జూపాడుబంగ్లా:** కార్ల్ మార్క్స్ రచనలు అమోఘమైనవని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు తెలిపారు. సోమవారం కార్ల్ మార్క్స్ జయంతిని పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన కార్ల్ మార్క్స్ అంచెలంచెలుగా ఎదిగారన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

పగిడ్యాల: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివరాముడు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే వినతుల రూపంలో అందజేసి పరిష్కారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి, ఏఓ విజయ్‌జ్యోతుకుమార్, ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై మారుతి భజన మండలి, గుత్తి, అనంతపురం జిల్లాకు చెందిన మారుతి భజన మండలి వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. గణపతి ప్రార్థన, లింగాష్టకం, శ్రీశైల శివమయం, శివశివ శంకరా, అమ్మా భ్రమరాంబాదేవి, కనరండి కనరండి శ్రీశైలం, పాతాళగంగమ్మ పాదాలు కడుగగా మొదలైన పలు భక్తిగీతాలను, భజన కీర్తనలను సంజీవ, ఆదినారాయణ, మల్లికార్జున, బీరప్ప, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, సుధాకర్, రామాంజనేయులు తదితరులు ఆలపించారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎస్ఎంయూ రీజినల్ వైస్ ప్రెసిడెంట్ పీ. సుధాకర్, డిపో కార్యదర్శి వైడీఆర్ స్వామి తహసీల్దార్‌ను కోరారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసులుకు సమస్యలతో కూడిన అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డీబీ నారాయణ, హనీఫ్, ఏ.నారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ రామాంజి నాయక్



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి నాయక్

పాములపాడు: ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ లోన్స్, యాప్స్, ఓటీపీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. సోమవారం రాత్రి మండలంలోని ఇస్కాల గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి వాహనం నడపరాదని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ సురేష్ బాబు పాల్గొన్నారు.

ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జూపాడుబంగ్లా: ఎండల పట్ల జర్నలిస్టులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ సూచించారు. సోమ వారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆల్‌వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు వి.ఆనంద్ ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీఓ చేతులమీదుగా విలేకరులకు టోపీలు పంపిణీ చేశారు. వారు మాట్లాడారు. కార్యక్రమంలో తాగునీటి శాఖ ఏఈ నాగేంద్ర, ఏపీఎం అంబమ్మ, హౌసింగ్ ఏఈ జ్యోతి, పాత్రికేయులు గోవర్ధన్, నాగభూషణం, నజీర్, రామకృష్ణ, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, సురేంద్ర పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామంలో తాగునీటి పైప్‌లైన్‌కు అధికారులు సోమ వారం మరమ్మతులు చేయించారు. వీధి కుళాయిల కు కలిషిత నీరు సరఫరా అవుతుండటాన్ని సాక్షి అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సువర్ణల, వీబీఆర్ ఏఈ పక్కీరయ్య సోమవారం గ్రామానికి వెళ్లి నీటిని పరిశీలించారు. పైపులైన్ మరమ్మతులు చేయించి, గ్రామంలోని 2 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులకు నీరు నింపి వీధి కుళాయిలకు సరఫరా చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ఏఎన్ఎంల నిరసన

బండి ఆత్మకూరు: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఏఎన్ఎంలు సోమవారం నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు.

ఉపాధి పనుల్లో అవకాశం కల్పించాలి

పాములపాడు: వీఓఏలకు ఉపాధి పనుల్లో అవకాశం కల్పించాలని లింగాల గ్రామానికి చెందిన వీఓఏ తిరుపతయ్య సోమవారం ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ అలివేలిమంగమ్మలకు వినతి పత్రాలు అందజేశారు.

నవధాన్యాల సాగుకు ముందుకురావాలి

నందికొట్కూరు: నవధాన్యాల సాగుకు రైతులు ముందుకురావాలని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత డాక్టర్ సయ్యద్ సూచించారు. సోమవారం బొల్లవరం యూనిట్ ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో పురవీధుల వెంట ఖరీఫ్ యాక్షన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపి పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో భూమిని రక్షించుకోవచ్చన్నారు. నవధాన్యాలను పొలంలో సాగు చేయడంతో రసాయన ఎరువుల వాడకం అవసరం ఉండదన్నారు. ప్రధాన పంటలకు కావలసిన అన్ని రకాల పోషకాలు భూమి నుంచి లభిస్తాయన్నారు. భూమి నీటిని ఇంకింపజేసే శక్తి పెరుగుతుందనే విషయం గుర్తించాలన్నారు.

నీటితో చెరువును నింపాలి



కలమందలపాడు చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

నందికొట్కూరు: కలమందలపాడు చెరువుకు నీటితో నింపాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మిడుతూరు మండలం కలమందలపాడు చెరువును లబ్బి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలమందలపాడు చెరువుకు హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ద్వారా ఒక టీఎంసీ సాగునీరు అందిస్తే సుమారు 10 వేల ఎకరాలను సాగు భూమిగా మార్చవచ్చన్నారు. భూ సేకరణ అవసరం లేకుండా ఉన్న చెరువుకు మరమ్మతులు చేయించి ఒక టీఎంసీ నీటితో నింపే అవకాశం ఉంటుందన్నారు. ఈ చెరువు నుంచి మిడుతూరు మండలంలోని జలకనూరు, తిమ్మాపురం, నారవారిపల్లె చెరువుకు, జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల చెరువుకు సాగునీరు అందించవచ్చన్నారు. పైపాలెం గ్రామ పొలిమేరలోని ఏపీఐఐసీ 4 వేల ఎకరాల భూమిపై నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలకు మాత్రమే హక్కు ఉందన్నారు. భూమిని కంపెనీలకు అప్పగిస్తే ఉద్యమిస్తామన్నారు. ఆయన వెంట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తువ్వ శివరామకృష్ణారెడ్డి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నందికొట్కూరు: ప్రైవేట్ పాఠశాలలో ఫ్రీ సీట్ కోసం ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ సుభాన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం కొన్ని ఫ్రీ సీట్లను ప్రైవేట్ పాఠశాలలు పేద విద్యార్థులకు ఇస్తున్నాయన్నారు. ఒకటో తరగతిలో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శుభ్రతను పాటించాలి

జూపాడుబంగ్లా: వ్యక్తిగత శుభ్రతతోనే రోగాలు దరిచేరవని హెల్త్‌సూపర్‌వైజర్ విజయలక్ష్మమ్మ, ఆరోగ్యకార్యకర్త సావిత్రి తెలిపారు. సోమవారం ప్రపంచ హ్యాండ్ వాష్ డే ను పురస్కరించుకుని స్థానిక కాసా నగర్‌లో స్థానికులకు చేతులను శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. బహిర్భూమికి వెళ్లొచ్చాక, భోజనం చేసే సమయంలోనూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు వెలుగు సీసీలు గాంధీ, జయలక్ష్మి, ధన్‌సింగ్‌నాయక్, కరుణాకర్, జయపాల్, వీఓఏ లు తిమ్మరాజు, భాస్కర్, బాలస్వామి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

ఆత్మకూరు: ఆర్టీసీ డిపో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని ఎన్ఎంయూఏ ఆత్మకూరు డిపో కమిటీ రీజినల్ నాయకులు సి.కె.కుమార్, డిపో అధ్యక్షులు కలిముల్లా, డిపో సెక్రటరీ బాషా, జాయింట్ సెక్రటరీ రహంతుల్లా, డెలిగేట్ గోపాల్ కోరారు. సోమవారం వారు తహసీల్దార్ రత్నప్రభను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డిపోలో వివిధ రూట్లలో తిరుగుతున్న బస్సులకు సరిపడా రన్నింగ్ సమయం ఇప్పించి, చట్ట ప్రకారం పని గంటలు అమలు చేయాలన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్, అర్చకులు శరభయ్యశర్మ, స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్త పూజలు నిర్వహించి ఆలయ ప్రాకారాల్లో పల్లకీసేవను కన్నులపండుగగా జరగగా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో మహానందీశ్వరస్వామి దంపతులను దర్శించుకున్నారు.

పేకాట రాయుళ్లపై కేసు నమోదు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామానికి చెందిన ఐదుగురు పేకాటరాయుళ్లపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ తెలిపారు. ఈర్నపాడు నుంచి సింగవరం రస్తాలోని వెంకటేశ్వరస్వామి దేవుని పొలంలో పేకాట ఆడుతున్నారని స్థానికులు ఇచ్చిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. ఈర్నపాడు గ్రామానికి చెందిన గడేకారి శ్రీనివాసులు, దూదేకుల మౌలాలి, పేరం తిరుపతయ్య, ఎర్రన్నతోపాటు మరొకరిపై కేసు నమోదు చేసి, వారి నుంచి రూ.7,170 స్వాధీనం చేసుకున్నామన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం నుంచి బుధవారం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవచండీయాగ సంపూర్ణ నవగ్రహ జన హోమసహిత వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి జయంతి సందర్భంగా కుంభాభిషేకం మహోత్సవం, హోమం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు నరహరి సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

డ్రోన్ కెమెరాలతో అసాంఘిక కార్యకలాపాల ఆటకట్టు

పగిడ్యాల: డ్రోన్ కెమెరాల సాయంతో గ్రామ శివారుల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాల ఆట కట్టించవచ్చని ముచ్చుమర్రి ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్టేషన్ పరిధిలోని పగిడ్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట తదితర గ్రామాల్లో తిరుగుతూ డ్రోన్ కెమెరాల ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. డ్రోన్‌ల సాయంతో వందల మీటర్ల దూరంలో జరిగే కార్యక్రమాలను వీక్షించి నేరం జరుగకుండా నియంత్రించే అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అందువల్ల నేరం చేసిన వ్యక్తులు తప్పించుకోలేరని, చట్టాలను గౌరవించి శాంతియుత జీవనం కొనసాగించాలని ప్రజలను కోరారు. అనంతరం లక్ష్మాపురం అంచె వద్ద వాహనాల తనిఖీ చేపట్టి హెల్మెట్, వాహన రికార్డులు సరిగా లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

అనుమతుల్లేని విత్తనాలు విక్రయించొద్దు

జూపాడుబంగ్లా: అనుమతుల్లేని విత్తనాలు విక్రయించొద్దని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి దుకాణదారులను హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాల కొనుగోలు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కచ్చితంగా రసీదు తీసుకోవాలన్నారు.